క్లుప్తంగా

పోలీసుల అదుపులో టీడీపీ నేతలు

సంగం: సంగంలో అధికారికంగా సాగుతున్న ఇసుక రీచ్‌లపై ఎటువంటి అనుమతులు లేకుండా దాడి చేసేందుకు వెళ్తున్న టీడీపీ నేతలను సోమవారం సంగం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంగంలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో అధికారికంగా ఇసుక రీచ్ కొనసాగుతోంది. ఈ క్రమంలో మండలంలోని టీడీపీ నేతలు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అత్యుత్సాహం కనబరుస్తూ సంగం ఇసుక రీచ్‌లోకి ప్రవేశిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి ఓ మహిళా నేతతో పాటు మరో 12 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పీకేపాడు రీచ్‌లో..

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం పడమటి ఖమ్మంపాడు ఇసుక రీచ్ వద్ద సోమవారం టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. రీచ్ వద్ద నిరసన చేస్తున్న టీడీపీ కార్యకర్తలను అనంతసాగరం, సోమశిల ఎస్సైలు సంతోస్‌కుమార్‌రెడ్డి, భోజ్యానాయక్ అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న ఇసుక రీచ్‌ల్లో ఏదో అక్రమాలు జరిగిపోతున్నాయంటూ టీడీపీ కార్యకర్తలు చేసిన హడావుడి చూసి స్థానికులు, కార్మికులు మండిపడ్డారు.

త్వరితగతిన డ్రైనేజీల నిర్మాణం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న డీఈఈ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో త్వరలోనే డ్రైనేజీల నిర్మాణం చేపడుతామని పంచాయతీ రాజ్ డీఈఈ సురేష్ అన్నారు. సోమవారం దర్గా ప్రాంతంలో ఆక్రమణలను తొలగించిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరలోనే డ్రైనేజీల నిర్మాణం చేపట్టి వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్‌సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: రైతుల వ్యవసాయ భూముల హద్దు వివాదాలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డ్రోన్ సర్వే సోమవారం మండలంలోని పడమటిపాళెంలో ప్రారంభమైంది. పడమటిపాళెం రెవెన్యూ పరిధిలో సుమారు 5 వేల ఎకరాల్లో డ్రోన్ సర్వే ద్వారా మరో మూడు రోజుల పాటు సరిహద్దులు గుర్తిస్తామని సర్వేయర్ శాంతకుమారి తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఆధ్యాత్మికవేత్త అవార్డు



బండారు దత్తాత్రేయ నుంచి బంగారు నంది అవార్డును అందుకుంటున్న వీర రాఘవన్

అల్లూరు: మదర్ థెరిస్సా స్ఫూర్తితో మంజునాథ ఫౌండేషన్ చైర్మన్ కీసర మంజులగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ వార్షికోత్సవ ప్రతిభ బంగారు నంది అవార్డ్స్ 2023లో అల్లూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కిందాబి వీరరాఘవన్‌కు ప్రముఖ ఆధ్యాత్మికవేత్తగా హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. ఆయన దగ్గర విద్యాభ్యాసాన్ని పొందిన విద్యార్థులు, శిష్యులు, అల్లూరు ప్రజలు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలను చైతన్యం చేయండి

చేజర్ల(సోమశిల): అధికారం కాంక్షతో ప్రతిపక్షాలతో పాటు పచ్చపత్రికలు అనునిత్యం ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం చిమ్ముతున్నారని, ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలు వివరించి చైతన్యం చేయాలని మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కులరెడ్డి అంకిరెడ్డి తెలిపారు. అనంతసాగరం మండలంలోని సోమశిల, పడమటి ఖమ్మంపాడు సచివాలయాల్లో సోమవారం సచివాలయ కన్వీనర్లకు గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అభివృద్ధి పనులను వివరించాలన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల విధివిధానాలపై చర్చించారు. అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన బీమా సౌకర్యం వివరాలను తెలిపారు.

సంక్షేమ చరిత్ర జగనన్న పాలన

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని, కనీసం ఊహించని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తూ సంక్షేమ చరిత్రను సృష్టించారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణం 1వ వార్డులోని మద్దూరుపాడులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. వారికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల జాబితాలో కూడిన బుక్‌లెట్లను ఎమ్మెల్యే అందజేశారు. పలు చోట్ల ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూత నిచ్చి పేదరికం నుంచి గట్టెక్కించడం, అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం, రాజకీయ పదవులు ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం చేయడం ద్వారా సీఎం జగనన్న రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారైన ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలు ఇష్టంగా వెళుతున్నారని, రుచికరమైన భోజనం, స్కూళ్లు తెరవకముందే చేతికందే పుస్తకాలు, యూనిఫాం, ఇంగ్లిష్ విద్య, ఎడ్యుటెక్ కంటెంట్‌తో అందే ట్యాబ్‌లతో రాష్ట్రంలోని విద్యార్థులను ర్యాంకర్లను చేస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు. విత్తనాల కోసం, ఎరువుల కోసం రోడ్డెక్కాల్సిన అవసరం లేకుండా రైతుల్ని ఆర్‌బీకేలకు చేయిపట్టి నడిపిస్తున్నాయన్నారు. విత్తు మొదలు పంట విక్రయం దాకా అన్ని సేవలూ అక్కడే అందేలా చేశారని చెప్పారు. హెల్త్ క్లినిక్‌లోని ఫ్యామిలీ డాక్టర్, ఊళ్లలో మంచాన పడ్డ వారికి ఇంటికెళ్లి చికిత్స చేస్తున్నారని, వార్డు/గ్రామ సచివాలయాల్లోనే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయని, అవ్వాతాతలకు వలంటీర్లు ఠంచనుగా పింఛన్ తెచ్చి చేతిలో పెడుతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, గుడ్లూరు మాల్యాద్రి,పోతనబోయిన వేణుగోపాలరావు, రమణమ్మ, పులి రజనీ, చక్రపాణి, స్కైలాబ్, వెంకయ్య, పుత్తూరు నాగాచారి, తిరువీధి ప్రసాద్, నాగేశ్వరమ్మ, సురే మదన్‌మోహన్‌రెడ్డి, శారద ఫణీంద్ర పాల్గొన్నారు.

సమష్టిగా కలిసి ప్రజల్లో ఉండండి

మరో ఆరు నెలలు కీలకం. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా అనునిత్యం ప్రజల్లోనే ఉండాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని 1వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పోతనబోయిన వేణుగోపాలరావు, రమణమ్మ దంపతులు, ఇటీవల కొత్తగా పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్ పులి రజనీ, చక్రపాణి దంపతులతో కలిసి ఎమ్మెల్యే వార్డులోని నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ కలిసి ఎన్నికల్లో మంచి మెజార్టీ తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ, పట్టణంలోని ప్రతి వార్డు నుంచి కూడా పార్టీకి ఎన్నికల్లో మెజార్టీలు వచ్చేలా కృషి చేయాలన్నారు.

జగనన్న లేఅవుట్లలో బోర్ల ఏర్పాటుకు చర్యలు



బోరుకు మోటారు ఏర్పాటు చేస్తున్న అధికారులు

వరికుంటపాడు: మండలంలో జగనన్న లేఅవుట్లలో పక్కాగృహాల లబ్ధిదారుల సౌకర్యార్థం బోర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం మండలంలోని ఆంధ్రావారిపల్లి ఓసీ, వరికుంటపాడు బీసీ జగనన్న లేఅవుట్లలో బోర్లకు మోటార్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని లేఅవుట్లలో బోర్లు వేసి మోటార్లు బిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, ఇంజినీరింగ్ సహాయకుడు సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ దృష్టికి మండల సమస్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

దుత్తలూరు: మండలలోని అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను జిల్లా పరిషత్ దృష్టికి తీసుకెళతానని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. పలువురు సర్పంచ్‌లు తమ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. జెడ్పీ సమావేశంలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతి దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకుని సంగంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పలువురు మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి ముఖ్యమంత్రి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రావుల ప్రసాద్‌గౌడ్, ఫణికుమార్‌రెడ్డి, పిట్టు పట్టాభిరామిరెడ్డి, కరిముల్లా, సచివాలయ కన్వీనర్ మల్లికార్జుననాయుడు, ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, శివ, కామేశ్వరరావు, మనోహర్, రామారావు, రవీంద్రబాబు, జహంగీర్, చిరంజీవి ఉన్నారు.

పాఠశాల ప్రాంగణానికి కొత్తరూపు



విశ్వనాథరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని మెరక చేసేందుకు తోలిన గ్రావెల్



పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, దాతలు

• దాతల సహకారంలో అభివృద్ధి

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం కొత్తరూపు సంతరించుకుంది. వర్షాకాలంలో చెరువును తలపించేలా ఉండే ప్రాంగణాన్ని దాతలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సొంత నిధులు వెచ్చించి మెరక చేసేందుకు చర్యలు చేపట్టారు. పాఠశాలలో మొత్తం 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా ప్రాంగణం అంతా లోతట్టుగా ఉండడంతో వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా పాఠశాల ప్రాంగణంలో నీళ్లు నిలిచి విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణాన్ని మెరక చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, దాతలు శ్రీకారం చుట్టారు. ఎంపీపీ మేకల సుజాత మండల పరిషత్ నిధుల నుంచి రూ.30 వేలు మంజూరు చేయగా, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మద్దిబోయి వీరరఘు రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. వీరితో పాటు విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి మంజుల రూ.5 వేలు, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన రూ.5 వేలు, ఎంపీటీసీ సభ్యులు సుందరరాజు రూ.5 వేలు, మద్దిబోయిన పద్మ రూ.5 వేలు, స్థానిక నాయకులు పాయసం శ్రీనివాసులు రూ.5 వేలు, సుధీర్ రూ.5 వేలు వంతున అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా రూ.2 వేల వంతున అందజేయడంతో గ్రావెల్‌తో ప్రాంగణాన్ని మెరక చేయిస్తున్నారు. వర్షాలకు ముందే పనులు పూర్తి చేయాలని త్వరితగతిన ప్రాంగణాన్ని అభివృద్ధి చేయిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించండి



ఆత్మకూరు: క్షయ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మంచి మందులు వాడితే నయమవుతుందని, ఇందుకు ప్రభుత్వం మందులు ఉచితంగా అందజేస్తుందని, ఆ వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించాలని జిల్లా టీబీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ ఈ హుస్సేనమ్మ అన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆమె సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. టీబీ పరీక్షల విభాగాన్ని పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన వివరాలను చూశారు. అనంతరం ఆమె ఆస్పత్రి సిబ్బంది, క్లస్టర్ హెల్త్ ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, క్రమం తప్పకుండా దగ్గు ఉంటే పరీక్షించి నివేదికలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాలలో మట్టికుండల ఏర్పాటు

వరికుంటపాడు: స్థానిక పీహెచ్‌సీకి వైద్య సేవల కోసం వచ్చే రోగులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఈసీ సభ్యుడు చల్లగాలి వెంకటమోహన్ మట్టి కుండలను వైద్యాధికారి కరిష్మాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, ఈసీ మెంబర్ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది రాజేశ్వరి, అభిలాష, శ్రీనివాసరావు, వెంకటయ్య పాల్గొన్నారు.

గిడుగు సత్కారానికి మున్నెల్లికి ఆహ్వానం



ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామమూర్తి జ్ఞాపకార్థం అందించే పురస్కారానికి మర్రిపాడు మండలం చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మున్నెల్లి శివశంకరయ్యకు ఆహ్వానం అందింది. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామమూర్తి పంతులు పేరిట అందజేసే పురస్కారానికి కూడా శివశంకరయ్యకు ఆహ్వానం అందింది. రామ్మూర్తి పంతులు ముని మనుమడు గిడుగు వెంకటనాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకోనున్నారు.

ఈత పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కావలి: స్థానిక విశ్వోదయ డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి కళాశాల ప్రాంగణంలోని ఈతకొలనులో పాఠశాలల విద్యార్థులకు ఈత పోటీలు సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ డి.వినయకుమార్‌రెడ్డి, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ డి.మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కె.తాతిరెడ్డి, ప్రిన్సిపల్ ఇన్‌చార్జి ఆర్.మాల్యాద్రి, నిర్వాహకులు పి.ప్రసాద్‌రెడ్డి, మణికంఠ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి: కలిగిరి ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని ఆయన సూచించారు.

ఆదరణ కేంద్రంలో భోజనం ప్యాకెట్లు పంపిణీ

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు కూడలిలోని హెచ్‌ఐవీ పాజిటివ్ వ్యాధిగ్రస్తుల ఆదరణ కేంద్రంలో కావలికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ షేక్ రబీనా సుల్తానా అధ్యక్షురాలు ఆధ్వర్యం షేక్ బాషా సహకారంతో సోమవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జహీర్, ఆఫ్రీద్, కలీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే రాజకీయాల్లోకి వచ్చా

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



దస్తగిరి అహ్మద్‌ను సన్మానిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: నియోజకవర్గంలో తాను ప్రజా సేవ చేసేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం రాత్రి స్థానిక షాదీమంజిల్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమితులైన షేక్ దస్తగిరి అహ్మద్ ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గం రాజకీయ చైతన్యం కలిగి ఉందన్నారు. తాను డబ్బు సంపాదించేందుకు రాజకీయంలోకి రాలేదని, తన అన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుచుకుంటానన్నారు. 40 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు తమ కుటుంబంపై ఎంతో ఆదరాభిమానాలు చూపుతున్నారన్నారు. వారి ఆదరాభిమానాలతో తమ సోదరులు ఎమ్మెల్యేలుగా, ఎంపీగా ఎంపికై ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తన అన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విద్య ఎంతో అవసరమని గుర్తించి ఆయన హయాంలో ఎన్నో పాఠశాలలు, కళాశాలలు స్థాపించారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికల్లో తనకు మంచి మెజారిటీ తెచ్చి పెడతారని ఆశిస్తున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలన్నారు. అనంతరం ఆయన దస్తగిరి అహ్మద్‌ను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు గాజులపల్లి రామిరెడ్డి, యువ నాయకుడు షర్ఫుద్దీన్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

తెలుగు భాషకు గిడుగు కృషి



మాట్లాడుతున్న జవహర్ భారతి డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధిపతి చెంచయ్య

కావలి: తెలుగుభాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన కృషి శ్లాఘనీయమని జవహర్ భారతి డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధిపతి వి.చెంచయ్య అన్నారు. తెలుగుభాషా పండగ వారోత్సవాల సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో సోమవారం 'తెలుగు భాష- గిడుగు వారి కృషి' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తెలుగు భాష నానాటికి అంతరించిపోతుందని ఆ నాడు గిడుగు వెంకట రామమూర్తి, గురజాడ అప్పారావు మొదలగు వారు గ్రాంధిక భాషలో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు, అధికారిక వ్యవహారాలు మొదలగు అన్నింటిని సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా వ్యవహారిక భాషగా మార్చేయడానికి ఎన్నో విమర్శలు ఎదుర్కొని ఎంతో కృషి చేశారని వివరించారు. అనేక సభలు, సమావేశాల్లో వారి వ్యవహార శైలి విమర్శలకు గురైనప్పటికీ వ్యవహారిక భాష ఆవశ్యకతని అందరికీ అర్థమయ్యేలా తెలియజేసి తెలుగు భాష అంతరించిపోకుండా కాపాడారన్నారు. అయితే ప్రస్తుతం తెలుగు భాష రాయడం మాట్లాడడం కూడా పాపం అనే విధంగా ప్రభుత్వాలు, తల్లిదండ్రులు చూస్తున్నారని, ఇలా అయితే మనం మన ఉనికినే కోల్పోతామన్నారు. విద్యార్థులు తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.మాల్యాద్రి అధ్యక్షత వహించగా డాక్టర్ జె.కృష్ణప్రసాద్ బాబు, పి.వసంతరావు, పి.నాగేశ్వరరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమం తెలుగు భాషా శాఖ అధిపతి పూరిమిట్ల నారాయణ, తాటిపర్తి హరికృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడితే అధోగతే



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ నయనతార

ఆత్మకూరు: గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి చెడు వ్యసనాలకు లోనైతే భవిష్యత్ అధోగతేనని సెబ్ సీఐ బీ నయనతార హెచ్చరించారు. సెబ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పట్టణంలోని జిల్లా పరిషత్ వెస్ట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో సీఐ నయనతార మాట్లాడుతూ మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, వినియోగించినా, రవాణా చేసినా తీవ్ర నేరమన్నారు. విద్యార్థి దశ నుండే వీటిని గుర్తెరిగి వాటికి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఆమె కోరారు. తొలుత డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే బ్యానర్ చేతబట్టి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 చలపతి, పాఠశాల హెచ్‌ఎం షేక్ ఫయాజుద్దీన్, సెబ్ ఎస్సై టీ కిరణ్ కుమార్, సిబ్బంది ఉపాధ్యాయులు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

• మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్
• ముగిసిన ఎంజీఆర్ క్రికెట్ టోర్నమెంట్



ఎంజీఆర్ క్రికెట్ టోర్నమెంట్ జూనియర్ విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ఆత్మకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే వారి ప్రతిభను అందరూ గుర్తిస్తారని, మంచి భవిష్యత్ ఉంటుందని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్ చెప్పారు. నాలుగు రోజులుగా ఆత్మకూరులోని ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎంజీఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి డాక్టర్ శ్రావణ్‌కుమార్ షీల్డ్, బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించే వారని, సొంత నిధులు అందించి ఎన్నో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడంతో పాటు యువతకు క్రికెట్ కిట్లను సైతం అందజేశారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిగా తాను క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంతో పాటు అవకాశమున్నంత మేర క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో జూనియర్ విభాగంలో ప్రగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థి టీం విన్నర్స్‌గా నిలువగా మేధా ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. కళాశాల విభాగంలో ప్రియదర్శిని జూనియర్ కళాశాల టీం విన్నర్స్‌గా నిలువగా ప్రభుత్వ జూనియర్ కళాశాల టీం రన్నర్స్‌గా నిలిచారు. రెండు విభాగాల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లుగా ఫరీద్, తన్వీర్, బెస్ట్ బౌలర్లుగా విష్ణు, జావీద్ నిలిచారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కె చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్‌బాష, ఆర్గనైజర్లు పురుషోత్తం, నాగా సుబ్రహ్మణ్యం, సయ్యద్ మస్తాన్, బాలాజీ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కావలి: మండలంలోని రుద్రకోటలో పాలిటెక్నిక్ కళాశాలలో టీం సేవియర్స్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీం సేవియర్స్ మహిళ విభాగం కన్వీనర్ కీర్తిప్రియ విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల వయస్సు, సాధారణ ఆరోగ్యం వారందరూ రక్తదానానికి అర్హులే అన్నారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థులు, సిబ్బంది, గ్రామ యువకులు రక్తదానం చేయగా, 100 మందికి రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ కె.హరినారపరెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ ఏవీ హనుమకుమార్, అధ్యాపకులు శివకుమార్‌రెడ్డి, టీం సేవియర్స్ సభ్యులు రమణ సుందర్, ప్రేక్ష, మణికంఠ, సుశాల్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



వివేకానంద కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు వివేకానంద జూనియర్ కళాశాలలో సోమవారం ఆ కళాశాలలో 2000 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఇరవై మూడేళ్ల నాడు చదివిన విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు కళాశాల ప్రాంగణంలో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉన్న అనుబంధాన్ని నెమరేసుకుంటూ తమకు చదువులు చెప్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడి బిజీ లైఫ్‌లో ఉన్నప్పటికీ అందరూ ఒకే వేదికపై కలవడం అభినందనీయమని కళాశాల కరస్పాండెంట్ మద్దూరి గోపాల్ రెడ్డి అన్నారు.